# కొంగ - ఎండ్రకాయ



అనగనగా ఒక ఊర్లో ఒక సరస్సు ఉండేది. ఆ సరస్సు నిండా బోలెడన్ని చేపలు ఉండేవి. వాటితో పాటు ఒక ఎండ్రకాయ కూడా ఉండేది. ఇలా అవి అన్నీ సంతోషంగా ఉండగా ఒక రోజు ఒక కొంగ వచ్చి ఆ సరస్సులో ఒంటి కాలి మీద నిలబడి దొంగ జపం మొదలు పెట్టింది. ఇదేంటో కొత్తగా ఉంది అని మన ఎండ్రకాయ ఆ కొంగ దగ్గరికెళ్ళి " కొంగ మహాశయా - ఇదేమిటి ఇలా ఒంటి కాలి మీద నిలబడ్డావు" అని అడిగింది.

అప్పుడు కొంగ " నేను పూర్వం చాలా చేపలని తిని పాపాలు చేసాను, ఒక రోజు నేను ఒక చెట్టు మీద కూర్చుని ఉండగా ఆ చెట్టు కింద ఒక మహానుభావుడు తన విద్యార్ధులకి ఉపదేశం చేస్తూ - పర ప్రాణులని చంపటం చాలా పాపం , అలా చేసిన వాళ్ళు నరకానికి పోతారు అని



PDF created with pdfFactory trial version www.pdffactory.com

చెప్పగా విని, నేను పశ్చాత్తాపపడి అప్పటినుంచి, ఇలా జపం చేసుకుంటూ బతుకుతున్నాను" అని చెప్పింది.

అది విన్న చేపలు కూడా సంతోషించాయి. సరే ఇలా కొన్ని రోజులు గడిచినాయి. ఒక రోజు కొంగ విచారంగా వచ్చి, ఏడుస్తూ దొంగకన్నీళ్ళు కారవటం మొదలు పెట్టింది. అప్పుడు చేపలు వచ్చి "ఏమిటి కొంగ గారు ? ఎందుకు అలా ఏడుస్తున్నారు?" అని అడగగానే మన కొంగ గారు " అయ్యో, ఇప్పుడే కొంత మంది జాలరులు మాట్లాడుకోవటం విన్నాను. కొన్ని రోజులు అయ్యాక వచ్చి ఈ సరస్సులోని చేపలన్నిటిని వల వేసి తీసుకుని పోదాము అని మాట్లాడుకుంటున్నారు. అది విని నాకు చాలా బాధగా ఉంది" అని చెప్పింది.

ఇది విన్న చేపలు భయపడిపోయి, "అయ్యా, మీరు పెద్దవారు - ఏదో ఒక ఉపాయం ఆలోచించి మమ్మల్ని ఈ కష్టం నుంచి గట్టెక్కించండి" అని వేడుకోగా , ఆ కొంగ " సరే ఇక్కడికి కొంత దూరంలో కొండ అవతల ఇంకో పెద్ద సరస్సు ఉంది. అక్కడికి మిమ్మలని అందరిని తీసుకుని పోయి విడిచిపెడతాను. అప్పుడు మీరు అక్కడ సుఖం గా ఉండవచ్చు. మీరు జట్లు జట్లు గా నా ముక్కుతో కరుచుకుని పోయి అక్కడ వదిలి పెడతాను" అని అనగానే పాపం ఆ పిచ్చి చేపలు, మెమ్మదిగా కొన్ని జట్లుగా తయారు అయ్యి అక్కడినుంచి వెళ్ళిపోవటానికి తయారు అయ్యాయి.

ఇలా రోజూ కొన్ని చేపల్ని తీసుకుని మన కొంగ గారు అలా కొండ మీదకి వెళ్ళి అన్నీ తినేసి చక్కా వచ్చేది. అలా చేపలన్నీ అయిపోతుండగా మన ఎండ్రకాయకి కూడ భయం పుట్టి నేను ఒక్కదాన్ని ఇక్కడ ఉండలేను, నన్ను కూడ తీసుకుని పో అని అడిగింది. కొంగ సరే దీన్ని కూడా తినేద్దాము అని దాన్ని కూడ తన ముక్కుకి కరుచుకుని ఆ కొండ మీదకి బయలుదేరింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

మన ఎండ్రకాయ గబుక్కున కిందకి చూసేటప్పటికి, ఆ కొండ మీద చేప బొమికలు, ముక్కలు కనపడ్డాయి. అప్పుడు కొంగ సంగతి అర్ధం అయ్యి దీన్నుంచి ఎలాగయినా తప్పించుకోవాలి అని ఒక ఉపాయం ఆలోచించి " మహానుభావా, నాకు నీ ముక్కు దగ్గర పట్టు దొరకడం లేదు, నీ మెడ పట్టుకుని వేళ్ళాడతాను" అని దాని మెడ పట్టుకుని వేళ్ళాడసాగింది.

కొంగ అలా కొండ మీదకి దిగగానే , మన ఎండ్ర కాయ తన వాడి కత్తెరలాంటి చేతులతో దాని మెడ కొరికి చంపేసింది.

## మరి పిల్లలూ ఈ కథలోని నీతి ఏమిటి ?

## ఆపద సమయంలో ఖంగారు పడకుండా, ఉపాయాలు ఆలోచించి , అలా ఉపాయంతో ఆపదనుంచి గట్టెక్కాలి అన్న మాట

keywords: Telugu lo Jataka Kathalu, Telugu lo china pillala kathalu, bala neeti kadhalu, telugu neeti kathalu, konga , endrakaya katha

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com